Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | శుక్రవారం మే 23 2025 | సంపుటి:2 సంచి 234 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

## పాక్‌ను మోకాళ్ల పై
# కూర్చోబెట్టాం



**ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం**

- సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం
- ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఇక అంతే సంగతులు
- మరోమారు పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ
- రాజస్థాన్ బికనీర్ వేదికగా పలు స్టేషన్లకు వర్చువల్‌గా ప్రారంభం

తెలంగాణవీణ,జయపుర,
మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో

-మిగతా 2 లో



## తెలంగాణలో వేగంగా
# అభివృద్ధి పనులు

- ప్రభుత్వం సహకరిస్తే..మరింత త్వరగా పూర్తి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- బేగంపేట అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉందన్న కోమటిరెడ్డి

తెలంగాణవీణ,హైదరాబాద్,
తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం

-మిగతా 2 లో



# గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- షెడ్యూల్ విడుదల చేసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

తెలంగాణవీణ, హైదరాబాద్,
గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ నెల 29 నుంచి జూన్ 10 వరకు ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు; అలాగే.. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు

-మిగతా 2 లో



## పాక్ ఉగ్రవాద చర్యలకు
# మద్దతు ఇవ్వొద్దు

- టర్కీకి ఘాటుగా హెచ్చరించిన భారత్

తెలంగాణవీణ, న్యూఢిల్లీ,
పాకిస్తాన్‌కి ఇటీవల కాలంలో టర్కీ మద్దతు ఇవ్వడంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. టర్కీకి బలమైన సందేశాన్ని పంపింది. పాకిస్తాన్ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని పరిష్కరించడానికి టర్కీ పనిచేయాలని భారత్ ఆశిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం తెలిపింది. ఉగ్రవాదాన్ని దేశ విధానంగా ఉపయోగించుకోకుండా పాకిస్తాన్‌ని నిరోధించడానికి, దశాబ్దాలుగా ఆశ్రయం ఇస్తున్న ఉగ్రవాద ఎకో సిస్టమ్‌పై

-మిగతా 2 లో

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

**ఐదుగురు మావోయిస్టులు మృతి**

తెలంగాణవీణ, ఛత్తీస్‌గఢ్
ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని పిడియా అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్న భద్రతా దళాలు.. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

-మిగతా 2 లో




## బీఆర్‌ఎస్ ఫ్యామిలీలో
# భగ్గుమన్న విభేదాలు

**పార్టీలో పనితీరుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసహనం**

- బీజేపీకి చేరువుతున్న తీరును తప్పు పట్టిన కవిత
- పార్టీలో ఎవరికీ అందనంత దూరంగా కేసీఆర్ తీరు
- పార్టీ రజతోత్సవ సభలో సీనియర్లకు దక్కని ప్రాధాన్యం
- కేసీఆర్‌ను ప్రశ్నిస్తూ..లేఖను సంధించిన తనయ

తెలంగాణవీణ,హైదరాబాద్
బిఆర్‌ఎస్ ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పదపదే చేస్తున్న ఆరోపణలు నిజం చేస్తూ కవిత రాసిన లేఖతో బటబయలు అయ్యింది. దీంతో ఇప్పుడు బిఆర్‌ఎస్‌లో ఏం జరుగుతోందన్న వాదన జరుగుతోంది. తాజాగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బిఆర్‌ఎస్ పార్టీలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ తీరుపట్ల

-మిగతా 2 లో





# ఈడీ అన్ని హద్దులు మీరుతోంది..

**దర్యాప్తు సంస్థపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

తెలంగాణవీణ, న్యూఢిల్లీ,
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అన్ని హద్దులూ దాటుతోందని వ్యాఖ్యానించింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ఆక్షేపించింది. టాస్మాక్ పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది.తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే

-మిగతా 2 లో



# కాళేశ్వరంను బాంబులు పెట్టి పేల్చారేమో

- కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టారేమో
- కేసీఆర్ పేరు లేకుండా చేసేందుకే కుట్రలు
- వరంగల్ సభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామాలు
- అందాల పోటీలతో దుబారా ఖర్చులు
- సీఎం రేవంత్, భట్టి మధ్యనా ఈ అందాల పోటీలు
- పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ విమర్శలు

తెలంగాణవీణ, హైదరాబాద్,
కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని, ఒక బ్యారేజీలో రెండు పగుళ్ల వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరోమారు మండిపడ్డారు.ఈ కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టి పేల్చేశారని నా అనుమానం అంటూ అసహనం వ్యక్తం చేశారు. పాలమూరులాగే కాళేశ్వరంలోనూ నిజం తెలుస్తుంది. చిల్లిగవ్వ పుట్టడం లేదంటూనే అందాల పోటీలు పెడుతున్నారు. రాష్ట్రం దివాళా తీసిందంటూనే దుబారా ఖర్చులు చేస్తున్నరు. వరంగల్ మహాసభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామా మొదలుపెట్టారని మండిపడ్డారు.

-మిగతా 2 లో

## ప్రభుత్వ పథకాలకు
# చేయూతనివ్వండి



- రాజీవ్ యువ వికాసానికి రుణాలు అందించాలి
- యువతను స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

తెలంగాణవీణ, హైదరాబాద్,
రాజీవ్ యువ వికాసం పథకం కింద జూన్ 2వ తేదీన ఐదు లక్షల మంది యువతకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్న లక్ష్యాన్ని సమయానికి సాధించేందుకు బ్యాంకర్ల సహకారం

-మిగతా 2 లో

# బీజేపీ చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది



- కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఇందుకు నిదర్శనం
- అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్

తెలంగాణవీణ, కరీంగనర్,
గతంలో బీఆర్‌ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా

-మిగతా 2 లో

## గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

(మొదటి పేజి తరువాయి)

యూనివర్సిటీ లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో పాటు వెరిఫికేషన్ కొరకు ఏయే సర్టిఫికెట్లు తీసుకొని వెళ్లాలో ప్రత్యేక జాబితాను విడుదల చేసింది. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు టీజీపీఎస్సీ తెలిపింది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ స్వయంగా సంతకం చేసిన ఫొటో కాపీలు తీసుకురావాలని సూచించింది. హాజరు కాలేని అభ్యర్థులు, వెబ్ ఆప్షన్స్ సరిగా నమోదు చేయని వారిని అనర్హులుగా ప్రకటించి.. ఖాళీలు మిగిలిన సందర్భంలో అవసరమైతే అదనంగా ఇతర అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తామని టీజీపీఎస్సీ పేర్కొంది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజి తరువాయి)

ప్రస్తుతం అక్కడ ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కాల్పుల్లో డీఆర్‌జీ జవాన్‌తోపాటు మరో సభ్యుడు మృతిచెందగా.. మరికొందరు జవాన్లు గాయపడ్డారు. గాయపడిన జవాన్ తాజాగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్–దంతేవాడ–బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో చోటు చేసుకున్నది.ద

## పాక్ ఉగ్రవాద చర్యలకు మద్దతు ఇవ్వొద్దు

(మొదటి పేజి తరువాయి)

విశ్వసనీయమైన, ధ్రువీకరించదగిన చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీ టర్కీని కోరింది. 'పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం మానేయాలని మరియు దశాబ్దాలుగా అది పెంచి పోషిస్తున్న ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థపై విశ్వసనీయమైన,ధృవీకరించదగిన చర్యలు తీసుకోవాలని టర్కీ గట్టిగా కోరుతుందని మేము ఆశిస్తున్నాము. సంబంధాలు ఒకరి ఆందోళనలకు మరొకరి సున్నితత్వంపై ఆధారపడి ఉన్నాయి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత టర్కీ, పాకిస్తాన్‌కి మద్దతు ఇచ్చింది. భారత్ పై దాడి చేయడానికి పాకిస్తాన్ టర్కీ తయారీ డ్రోన్లను ఉపయోగించింది. ఇదే కాకుండా, వీటిని ఆపరేట్ చేయడానికి ఇద్దరు టర్కిష్ వ్యక్తుల్ని నియమించింది. అయితే, భారత్ జరిపిన దాడుల్లో టర్కీ డ్రోన్లు ధ్వంసం కావడంతో పాటు ఇద్దరు వ్యక్తులు కూడా మరణించారు. ఈ నేపథ్యంలోనే భారత్, టర్కీ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టర్కీ నుంచి భారత్‌కి దిగుమతి అయ్యే ఆపిల్స్‌ని భారత వ్యాపారులు కొనడం లేదు. దీంతో పాటు టర్కీకి వెళ్లే టూరిస్టుల సంఖ్య చాలా తగ్గింది. ఇదే కాకుండా, ఎయిర్ పోర్టు గ్రౌండింగ్ సేవలు అందించే, టర్కీకి చెందిన సంస్థ సెలిబి అనుమతిని రద్దు చేసింది.

## ఈడీ అన్ని హద్దులు మీరుతోంది..

(మొదటి పేజి తరువాయి)

మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ.1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టాస్మాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇటీవల సోదాలు జరిపారు. ఆ సంస్థ ప్రధాన కార్యాలయం, టాస్మాక్ అధికారుల ఇళ్లల్లో ఈ ఏడాది మార్చి, మే నెలల్లో తనిఖీలు చేపట్టింది. దీంతో ఈ సోదాలపై తమిళనాడు సర్కార్ హైకోర్టుకు వెళ్లింది. అక్కడ ఈడీ చర్యలను మద్రాస్ హైకోర్టు సమర్థించింది. విచారణ పేరిట టస్మాక్ అధికారులను ఈడీ వేధిస్తోందంటూ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేస్తూ.. ఈడీ దర్యాప్తుకు అనుమతించింది. దీనిపై స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈడీ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఈడీ 'అన్ని హద్దులూ మీరుతోంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాఖ్య పాలన భావనను ఈడీ ఉల్లంఘిస్తోందన్న ధర్మాసనం.. టాస్మాక్ పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తును వెంటనే ఆపేయాలని ఆదేశించింది. సుప్రీం తీర్పును డీఎంకే ప్రభుత్వం స్వాగతించింది.

## కాళేశ్వరంను బాంబులు పెట్టి పేల్చారేమో

(మొదటి పేజి తరువాయి)

కాళేశ్వరం ఒక ఇంజినీరింగ్ మార్వెల్ అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన అద్భుత కట్టడాలను అందగత్తెలకు చూపించారు. లక్షన్నర కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించారు. అందాల పోటీలు రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు మధ్య జరుగుతున్నట్టు ఉన్నాయి. మిస్ వరల్డ్ బ్యానర్ల మీద రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు ఫొటోలు చూశా.. వారిలో ఎవరు మిస్ వరల్డ్ పోటీదారులో అర్థం కాలేదంటూ ఎద్దేవా చేశారు. చార్మినార్ అగ్నిప్రమాదంపై రేవంత్ రెడ్డికి రివ్యూచేసే సమయం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కష్టంలో ఉన్న తల్లిలాంటి పార్టీని నమ్ముకొని ఉండే వారే నిజమైన కార్యకర్తలని కేటీఆర్ అన్నారు. అవకాశవాదులే సిగ్గులేకుండా పార్టీ మారుతారని విమర్శించారు. పార్టీ నుంచి పారిపోయిన వారి పేర్లు తీసుకొని వారిని పెద్దోళ్లను చేయొద్దన్నారు. పార్టీ కోసం కొట్లాడేవారికే అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలే రేవంత్ పాలనపై మండిపడుతున్నారని, ఇదేం పాలన అంటూ ఆ పార్టీ నాయకులే నిలదీస్తున్నారన్నారు. 'రాష్ట్రంలో కమీషన్ల పాలన కొనసాగుతున్నది. కమీషన్ల పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. 30 శాతం కమీషన్ లేనిదే ఫైళ్లు కదులుతలేవు. తమ ప్రభుత్వంలో ఫైల్‌లు కదలాలి అంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని కొండా సురేఖ చెప్పారు. మా ప్రభుత్వంలో మంత్రులు 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారు ఇంకొక కాంగ్రెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కాళేశ్వరం కమిషన్ అంటూ విమర్శలు గుప్పించారు. రెండు లక్షల రుణమాఫీ ఎంతమందికి చేశారు?. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రుణమాఫీ ఇచ్చింది పావు వంతే. రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోయాయి. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి లబ్ది జరిగింది.

# తెలంగాణలో వేగంగా అభివృద్ధి పనులు

(మొదటి పేజి తరువాయి)

నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు.'తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తే, మాజీ సిఎం కెసిఆర్ కనీసం రాలేదని విమర్శించారు. విప్లవాత్మకమైన అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని అన్నారు. ఇప్పటికే చర్లపల్లి రైల్వేస్టేషన్ ను ప్రారంభించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రోచ్ రోడ్ కు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంత వేగంగా సహకరిస్తే, అంతకంటే వేగంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్‌లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ ? యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.

# పాక్ ను మోకాళ్లపై కూర్చోబెట్టాం

(మొదటి పేజి తరువాయి)

ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు.

'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహిమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు' అని గట్టి హెచ్చరికలు చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్‌వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్‌నోక్ స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే బికనేర్–ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు. ఇక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా మోడీ ప్రారంభించారు. కొత్త స్టేషన్లను జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఏపీలోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్‌లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్‌ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారిగా ప్రధాని మోదీ రాజస్థాన్‌లో పర్యటించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకు ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని బికనీర్ ఎయిర్ బేస్‌ను సందర్శించడం గమనార్హం.

# బీఆర్ఎస్ ఫ్యామిలీలో భగ్గుమన్న విభేదాలు

(మొదటి పేజి తరువాయి)

ఎమ్మెల్సీ కవిత ధిక్కార స్వరం వినిపించారు. పార్టీ తీరుపై నేరుగా కేసీఆర్‌కే ప్రశ్నలు సంధించారు. తన సందేహాలను వ్యక్తం చేస్తూ గురువారం నాడు కేసీఆర్‌కు సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇంకా ఈ లేఖలో ఆమె కేసీఆర్‌కు ఎలాంటి ప్రశ్నలు సంధించారనే వివరాలను చూస్తే, పార్టీ తీరుపట్ల ఆమె అసమనంగా ఉన్నట్లు తెలుస్తోంది. బిజెపితో అంటకాగేలా వ్యవహారాలు ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నిర్ణయాలు, వ్యవహారాల పై సూటిగా ప్రశ్నలు సంధిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు. మై డియర్ డాడీ అంటూ కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తన సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు అంశంపై సిల్వర్ జూబ్లీ సభలో కూడా క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీజేపీ మీద రెండు నిమిషాలే మాట్లాడారని.. ఆ పార్టీపై ఇంకా బలంగా మాట్లాడాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటారేమో అనే చర్చ మొదలైందన్నారు. తాను సఫర్ అయ్యాను కదా.. బహుశా అందుకని కావొచ్చు అని కవిత తన లేఖలో పేర్కొన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని కవిత తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కాంగ్రెస్‌పై గ్రాస్‌రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. కేసీఆర్ యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధపడుతున్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించండి అంటూ కూడా సూచనలు చేశారు. వరంగల్ సభలో ఉద్యమ నేతలకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. 2001 నుంచి మీతో ఉన్నవారికి మాట్లాడే అవకాశం ఇస్తే బావుండేది. పాత ఇన్‌చార్జ్‌లకే బాధ్యతలు ఇవ్వడం కూడా కేడర్‌కు నచ్చలేదు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారికి.. నేరుగా పార్టీ ఆఫీసు నుంచే బీ ఫామ్స్ ఇవ్వాలి. వరంగల్ సభలో ఉర్దూలో మాట్లాడలేదు, వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం అంశాన్ని విస్మరించారు.' అని కవిత తన లేఖలో సంచలన అంశాలను ప్రస్తావించారు. వాస్తవానికి కవిత అమెరికాకు వెళ్లడానికి ముందే కేసీఆర్‌కు లేఖ రాసినట్లు కాంగ్రెస్ నేత సామ రామ్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఈ అంశాన్ని హైలెట్ చేశారు.

## ప్రభుత్వ పథకాలకు చేయూతనివ్వండి

(మొదటి పేజి తరువాయి)

అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవడం ముఖ్యమని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదు లక్షల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6,250 కోట్లు సబ్సిడీతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. యువతను ఉత్పత్తి రంగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేలా పథకం రూపొందించామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం సజావుగా అమలవడానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారి నియమించి సమన్వయం చేయాలని, పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రత్యేకంగా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే రైతు బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వం కట్టుతుందని తెలిపారు.

## బీజేపీ చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

(మొదటి పేజి తరువాయి)

ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తెలంగాణ వీణ

తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 8328209811



## ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా

### 150మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



**తెలంగాణవీణ, అనకాపల్లి,**
ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనకాపల్లి పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి 150 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. 30 మందిపై కేసులు నమోదు చేశారు. సైబర్, ఆన్ లైన్ మోసాలపై మంగళవారం రాత్రి జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై జిల్లా పోలీసులు గత రెండు రోజులుగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో అచ్యుతాపురం శివారులోని పలు అపార్ట్‌మెంట్లపై దాడి చేసి.. ఈ మోసాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అపార్ట్‌మెంట్లను ఈ ముఠా అద్దెకు తీసుకుని ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన కీలక డేటాను పోలీసులు సేకరించారు. విదేశీయుల ఖాతాలను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్ మోసాలకు ఈ ముఠా పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అపార్ట్‌మెంట్లకు నెలకు రూ. 18 లక్షలు అ÷-దదెగా చెల్లిస్తున్నట్లు పోలీసులు విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ అరెస్టయిన వారంతా యువతి యువకులే కావడం గమనార్హం. స్థానిక పోలీసులతోపాటు సైబర్ పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు.


## పంజాబ్, హర్యానా హైకోర్టుకు బాంబు బెదిరింపు




**తెలంగాణవీణ, చండీగఢ్ .**
పంజాబ్, హర్యానా హైకోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. గురువారం మధ్యాహ్నం కోర్టులో బాంబు ఉందంటూ ఈ-మెయిల్ బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కోర్టు రూములను ఖాళీ చేయించారు. చడీగఢ్ పోలీసులతోపాటు రెస్క్యూ టీమ్, ఫైర్ సిబ్బంది హైకోర్టుకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన వస్తువును పరిశీలిస్తున్నారు.అడ్వకేట్లు అంతా కోర్టు ఆవరణను విడిచి వెళ్లాలని బార్ అసోసియేషన్ కోరింది. అప్రమత్తంగా ఉండాలని, చుట్టుపక్కల పరిసరాల్లో అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసు లేదా బార్ అసోసియేషన్ సమాచారం అందించాలని తెలిపింది. బెదిరింపుల నేపథ్యంలో కోర్టు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా, అంబాలా రైల్వే స్టేషన్‌కు కూడా ఇదేవిధమైన బాంబు బెదిరింపు వచ్చినట్లు తెలుస్తున్నది. బుధవారం మధ్యాహ్నం గురుగ్రామ్ మినీ సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో సెక్రటేరియట్‌ను ఖాళీ చేయించిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించకపోవడంతో అది ఫేక్ అని నిర్ధారించారు.

## గ్రీస్‌లో భారీ భూకంపం..


### సునామీ హెచ్చరికలు జారీ



**తెలంగాణవీణ, గ్రీస్**
ఆగ్నేయ ఐరోపా దేశం గ్రీస్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.0గా నమోదైనట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ తెలిపింది. భూ అంతర్భాగంలో 77 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది.అయితే, ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. మరోవైపు భూ ప్రకంపనలతో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్త చర్యగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూప్రకంపనల ప్రభావంతో గ్రీస్ సమీప దేశాలైన కైరో, ఇజ్రాయెల్, ఈజిప్ట, లెబనాన్, తుర్కియే, జోర్డాన్‌లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కాగా, పది రోజుల వ్యవధిలోనే గ్రీస్‌లో భూకంపం సంభవించడం ఇది రెండోసారి. ఈనెల 14వ తేదీన కూడా గ్రీకు ద్వీపం కాసోస్ ప్రాంతంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.1గా నమోదైంది. భూ అంతర్భాగంలో 78 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఫ్రై పట్టణానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నదని వెల్లడించింది.

## వాషింగ్టన్‌లో ఉగ్రదాడి..

### ఇజ్రాయెల్ ఎంబసీ ఉద్యోగులను కాల్చి చంపిన ముష్కరులు



**తెలంగాణవీణ, వాషింగ్టన్**
అగ్రరాజ్యం అమెరికాలో ఉగ్రదాడి కలకలం రేపింది. వాషింగ్టన్ డీసీ లోని ఇజ్రాయెల్ ఎంబసీ ఉద్యోగులపై ఉగ్రవాదులు దాడి చేశారు. సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సిబ్బంది మృతి చెందారు.అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేపిటల్ జెవిష్ మ్యూజియం సమీపంలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మ్యూజియంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన సిబ్బందికి అతి సమీపంగా వచ్చిన ముష్కరులు కాల్పులు జరిపారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉన్నట్లు తెలిసింది. కాల్పుల అనంతరం ఉగ్రవాదులు ఫ్రీ పాలస్తీనా నినాదాలు చేశారు. ఈ ఘటనను ఇజ్రాయెల్ యూఎన్ రాయబారి డానీ డానన్ తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై అమెరికా అధికారులు చర్యలు తీసుకుంటారని తాము విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు నివసించే వాషింగ్టన్ డీసీ నగరంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అలాంటి చోట ఉగ్రదాడి జరగడం కలకలం రేపుతోంది.

## ఆపరేషన్ సిందూర్ వేళ పాకు దుస్సాహసం

### ఉగ్రమూకలను భారత్‌లోకి జొప్పించే యత్నం తిప్పికొట్టిన సరిహద్దు బద్రతా దళం



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ,**
ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. సరిహద్దు వెంబడి భారత్‌లోకి జొప్పించే ప్రయత్నం చేయగా భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. దీంతో ఉగ్రమూకలు భారత్‌లోకి రాకుండా అడ్డుకట్ట పడింది. ఈ విషయాన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయి. ఇందుకోసం భారీగా షెల్లింగ్ కూడా చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'మా జవాన్లు వారికి తీవ్ర స్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని.. గుర్తించగానే దాడులు నిర్వహించాము. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. దీంతో అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాము. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీ స్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాము. దీంతో వారు తమ పోస్టులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాము. వారి బంకర్లు, ఆయుధాలను ధ్వంసం చేశాము. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలను నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది' అని డీఐజీ వెల్లడించారు. బుధవారం పూంచ్‌లోని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ వేళ జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నట్లు బీఎస్ఎఫ్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

## మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

### --జీవవైవిధ్య దినోత్సవంలో పవన్ కల్యాణ్



**తెలంగాణవీణ,-అమరావతి**
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అటవీ భూములు ఆక్రమించుకునే వారు ఉన్నారని, కొత్తగా అడవులు సృష్టించాలన్న ఆలోచన ఉన్నవారు కరువయ్యారని చెప్పారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు మన ఇంటి నుంచే మొదటి అడుగు వేయాలని కోరారు. పర్యావరణం అంటే మొక్కలకు సంబంధించిన విషయం కాదని, మన జీవన శైలి అని చెప్పారు. సీడ్ బాల్స్ తయారు చేసి విసరడం ద్వారా వేల సంఖ్యలో మొక్కలు నాటే వీలు ఉంటుందన్నారు. సముద్ర తీరంలో సునామీ, తుపాన్ వంటి విపత్తుల నుంచి రక్షణగా ఉండే మడ అడవులను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి విధ్వంసం ప్రమాదకరమని, దీనిని సరిదిద్దుకోకపోతే సమస్త మానవజాతి నష్టపోతుందన్నారు. ఒక్క పక్షి కూడా నివాసం ఉండని యూకలిప్టస్, కోనోకార్పస్ వంటి మొక్కలు నాటుతున్నామని, అవి ప్రాణవాయువును అతి తక్కువ మోతాదులో అందిస్తాయని చెప్పారు. పక్షులు కూడా వాలని మొక్కలు ఎలా అమ్ముతారని, నర్సరీలలో పెంచేప్పుడు సాధ్యమైనంత వరకు అటవీశాఖ మార్గదర్శకాలు పాటించాలని చెప్పారు. కడియం నర్సరీలు ఈ మొక్కల అమ్మకాలు నిలిపివేసే అంశంపై ఆలోచన చేయాలని తెలిపారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తరపున ప్రతి జిల్లాలో ఒక బయోడైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో ఒక పల్లెవనం ఏర్పాటు చేస్తామన్నారు. పక్షులు, తేనెటీగలకు ఆశ్రయం కల్పించే మొక్కలు వీటిల్లో నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపిటిఎస్ చైర్మన్ మోహన్ కృష్ణ, బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, ఏపిఎఫ్‌డిసి ఎండి ఆర్‌పి ఖజురియా తదితరులు పాల్గొన్నారు.


GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# సంపాదకీయం

## ప్రకృతి విధ్వంసంతో అత్యంత ప్రమాదం !

ధర్మో రక్షతి రక్షితః..ఇది భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుంది. అలాగే ప్రకృతిని మనం కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటుంది. భారతీయ సనాతన ధర్మం అంతా ప్రకృతిని పూజించడం, జీవ వైవిధ్యం గురించి వివరించడం జరిగింది. గాలి,నీరు, భూమి, ఆకాశం, అగ్ని అని పంచభూతాలను పూజించాలన్నది అందుకే. అంటే ఇవి మనిషి మనుగడకు తోడ్పడుతాయి కనుక వాటిపట్ల మనం కృతజ్ఞతగా ఉండాలని భారతీయ సంస్కృతి చెబుతోంది. అంటే పూజించడమనే కాదు..రక్షించడం..కాపాడుకోవడం అన్న పరమార్థం ఉంది. చెట్టును, పుట్టను పూజించడం వెనక ఉన్న మర్మం కూడా ఇదే. జీవవైవిధ్యం అనగా భూమిపైగల వివిధ రకాల జీవజాతులను రక్షించుకోవడం. జీవవైవిధ్యం కానాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తిని కాపాడిన వారం అవుతాం. అందుకు ప్రధానంగా పంచభూతాలను రక్షించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి విధ్వంసం మొదలైన తరవాతనే మానవాళికి ముప్పు ఏర్పడిందని గుర్తించాలి. కరోనాలాంటి వైరస్‌లు వచ్చినా తట్టుకునే స్థితిలో మనం లేమంటే..అందుకు మనం ప్రకృతిని నాశనం చేయడమేనని తెలుసుకోవాలి. మానవ తప్పిదాల కారణంగా లేదా విధ్వంసం కారణంగా జీవజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించిపోతోంది. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహనను పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే22 న 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని' జరుపు కోవాలని నిర్ణయించింది. మనం పూజా పునస్కారాలతో మన ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేశాం. దీనిని తరవాతి తరం వారు ఈ పూజలేంటని విస్మరిస్తూ వచ్చారు. అంటే మనకు జీవనాధారంగా ఉన్న ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ వస్తున్నాం. భారతీయ సంస్కృతిలో జీవవైవిధ్యాన్ని పూజించటం, దైవస్వరూపంగా భావించటం గొప్పవిషయం. అందులో భాగంగానే చెట్లు,చేమ, పశుపక్ష్యాదులను పూజించటం జరుగుతోంది. జీవవైవిధ్యంలోని జీవజాతులు వివిధ రకాల సేవలను, ప్రయోజనాలను మానవ జాతికి, పర్యావరణానికి అందిస్తాయి. ఉదాహరణకు మానవులు, ఇతర జీవజాతుల జీవనక్రియలో భూమిపై విడుదల అయ్యే వ్యర్థ పదార్థాలను భూమిలోని సూక్ష్మజీవులు కృశింపచేసి భూమిని సారవంతం చేయుటలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ పర్యావరణ సేవలను కేవలం సూక్ష్మజీవులు మాత్రమే నిర్వహించ గలవు. జామకాయ, ఆపిల్, ఉసిరి, కూరగాయలు వంటివి ఆహారంగా పనికి వస్తాయి. అదేవిధంగా వేప, తులసి మొదలగువాటిని ఔషధాలుగా ఉపయోగపడుతున్నాయి. వివిధ జీవజాతులు ఒక నిర్దిష్టమైన పనికి లేదా పర్యావరణ సేవలకు ఉపయోగపడతాయి. అదేవిధంగా కొన్ని నిర్దిష్టమైన జంతువులు మాత్రమే మానవులు ఆహారంగా తినటానికి అనువైనవి. ఉదాహరణకు కోడిమాంసం, గొర్రె, పొట్టేలు మాంసం, జలచరాలు అయిన చేపలు మొదలగునవి తినటానికి అనువైనవి. ఇవి ఆరోగ్యానికి మంచిది. మానవ ఆహారం 80 శాతానికి పైగా మొక్కల ద్వారా అందుతోంది. ఆవు పాల ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఆవుపాల ఉత్పత్తులకు విశిష్ట స్థానం కలదు. ముఖ్యంగా చిన్న పిల్లలకి ఆవుపాలు ఎంతో మేలుచేస్తాయి. ఆవు నెయ్యి మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచటమే కాక ముఖ్యమైన విటమిన్లను కలిగి ఉంటుంది. ఆవు పాల ఉత్పత్తుల ను హిందూమత పూజా కార్యక్రమాలలో, శుభ కార్యక్రమాలలో విరివిగా వాడడానికి కారణం ఇదే. భారతీయ సంస్కృతిలో ఆవు ఒక భాగం. ఆవు జీవవైవిధ్యంలో అత్యంత ప్రయోజనకరమైన జంతువు. ఆవు పాలే కాదు దాని పేడ, మూత్రం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవవైవిధ్యంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆవును చంపి మాంసాహారంగా తీసుకోవడం వల్ల మన ప్రకృతిని మనమే ధ్వంసం చేస్తున్నాం. ఆవును పూజించాలన్న ఓ బృహత్తర కార్యక్రమం వెనక కేవలం జీవవైవిధ్య పాత్ర ఉందని చెప్పాలి. ఈ క్రమంలో పశుమాంసానికి అలావాటు పడడం వల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోతోంది. పాలు ఇచ్చే సాధు జంతువులు అయిన గేదె,ఆవులు సంఖ్య తగ్గిపోవటం వలన డిమాండ్‌కు తగినవిధంగా పాల ఉత్పత్తి ఉండటం లేదు. జీవవైవిధ్యం నశిస్తే మానవ జాతి కూడా నశిస్తుంది. పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న పశువులను మాంసంగా వినియోగించరాదన్న డిమాండ్ వెనక ఉన్న పరామర్థాన్ని గుర్తించాలి. గోవును పూజించాలన్న పూర్వీకుల ఆచారం వెనక ఎంతటి పరిశోధన ఉందో గమనించాలి. మాంసాహారం తప్పు కాదు. కానీ సమాజానికి అత్యంత అవసరమైన జంతువులను తినడం సరైనది కాదు. ప్రజలు జీవవైవిధ్యానికి ఏది ముఖ్యమో, ఆహారానికి ఏది అవసరమో శాస్త్రీయంగా ఆలోచించాలి. జీవవైవిధ్యం మనుగడ సాగించగలదు. తద్వారా మానవాళి భూమిపై ఆనందంగా జీవనం కొనసాగించగలదు. జీవవైవిధ్య విధ్వంసం వల్లనే కరోనా వైరస్, సార్స్, ఎబోలా వంటి వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తున్నాయి. జీవవైవిధ్యం కోల్పోతే లేదా విధ్వంసానికి గురయితే మానవులు ఆరోగ్యంతో సహా అన్నింటినీ కోల్పోతారు. కాబట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూడరాదు. మానవుని అనాలోచిత చర్యల వల్ల వాతావరణంలో కలుగుతున్న మార్పులు తోడయి, భూమ్మీద నివశిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగించుకుంటూ, కలుషితాలను తిరిగి ప్రకృతిలోకి విడుదలచేయటం జరుగుతున్నది. నిత్యం పెద్దయెత్తున్న వెదజల్లబడుతున్న కలుషితాలు, విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూవాతావరణం గతంలో ఎన్నడూ లేనంతగా వేడెక్కుతుంది. పెరుగుతున్న భూతాపం, భూమ్మీద నివశిస్తున్న సకల జీవరాశుల మనుగడను తీవ్ర సంక్షోభానికి గురి చేస్తుంది.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**తెలంగాణవీణ, శేరి లింగంపల్లి ప్రతినిధి**

హనుమాన్ జయంతి పర్వదినంను పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్ లో గల శ్రీ హనుమాన్ దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో,ఎక్కడ శ్రీరామ నామం వినిపిస్తుందో అక్కడ హనుమంతుడు ఉంటాడు. ఆయనను మించిన భక్తుడు లేడంటూ శ్రీ రామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్యశాలి హనుమంతుడు అని



అన్నారు. అదేవిధంగా రామాయణానికి ఓ నిండుదనాన్ని తీసుకు వచ్చాడు.సుగ్రీవుడిలో కదలిక తీసుకు వచ్చి అతని సైన్యాన్ని ముందుకు నడిపించడంలోనూ లంకలో ఉన్న సీతమ్మవారి ఆచూకీ తెలుసుకోవడంలోను వారధి నిర్మించడంలోను యుద్ధరంగాన లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు 'సంజీవిని'పర్వతాన్ని పెకిలించి తీసుకు రావడంలోను హనుమంతుడు కీలకమైన పాత్రను పోషించాడు అందుకే హనుమంతుడులేని రామాయణాన్ని అస్సలు ఊహించలేం అని, హనుమంతుడి గుడి లేని ఊరు లేదు అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,ఓం ప్రకాష్ గౌడ్, కృష్ణ పటేల్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, అశోక్, వెంకటేష్ గౌడ్, రవి గౌడ్, కృష్ణ గౌడ్, వీరేందర్, ప్రవీణ్, మహేందర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్,శివ ముదిరాజ్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీర్నెముల గ్రామాన్ని సందర్శించిన డి.ఎల్.పి.ఓ ప్రతాప్ నాయక్

**తెలంగాణవీణ, రామన్నపేట ప్రతినిధి**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో మంచినీటి ట్యాంకులకు మెట్లు లేక ఇబ్బంది పడుతున్నారని 24ఏప్రిల్2025 రోజున జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అట్టి విషయమై గ్రామంలో పర్యటించి విచారణ కొరకు డి.ఎల్.పీ.వో ప్రతాప్ నాయక్ గురువారం రోజున నీర్నేముల గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు అలాగే గ్రామంలో ఉన్న మరి కొన్ని సమస్యలకు ప్రభుత్వం నుండి నిధులు వస్తే తప్ప పరిష్కారం చేయలేమని తెలిపారు తక్షణమే మంచినీటి ట్యాంకులకు మెట్లు నిర్మించే విధంగా జిల్లా కలెక్టర్ కి నివేదిక సమర్పిస్తానని ప్రజలందరికీ హామీ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా పలువురు ప్రజలు





మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని యెడల గ్రామంలో నిరాహార దీక్షలు చేసైన సమస్యలను పరిష్కారం కోసం పోరాడుతామని,జిల్లా కలెక్టర్ నిధుల ద్వారా తక్షణమే మెట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రాపుట్,పంచాయతీ కార్యదర్శి లక్ష్మి,మిషన్ భగీరథ ఏ.ఈ,తాజా మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్ గ్రామ ప్రజలు బండ జగన్ మోహన్ రెడ్డి,బోయిని మల్లేష్,నాగటి లక్ష్మణ్, నేమనంది లింగయ్య ఆవుల కిష్టయ్య,బెల్లం నరసింహ,రామచంద్రం ఆవుల సత్తయ్య,గంగుల విటల్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైన్యంపై చులకన మాటలొద్దు

భారతదేశ సరిహద్దు సుమారు 15,200 కిలోమీటర్లు. ఇది పశ్చిమంలో గుజరాత్ నుంచి తూర్పున మిజోరాం వరకు ఉంది. ఈ సరిహద్దు అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సరిహద్దులతో కూడి ఉంటుంది. ఇంత సుదీర్ఘ సరిహద్దుని వివిధ వాతావరణ పరిస్థితుల్లో కాపాడడం అంటే మాటలు కాదు. సరిహద్దు రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్, పంజాబ్‌లలో పగటిపూట ఉష్ణోగ్రత 55/60 డిగ్రీల సెల్సియస్ ఉంటే, రాత్రిపూట మైనస్ 20కి తగ్గిపోతుంది. అదీగాక ఈ ప్రాంతాల్లో ఎడారి విషపురుగులు, పాములు ఎక్కువ. ఇక్కడి వేడికి శరీరం బొబ్బలెక్కుతుంది. అటువంటప్పుడు బరువైన బూట్లలో ఉండే సైనికుల కాళ్ళు పుండ్లు పడిపోతాయి. అలాగే ఉత్తరాన హిమాలయాల్లో పగటి ఉష్ణోగ్రతలే మైనస్ 40/50 డిగ్రీలు ఉంటుంది. పైగా దుర్గమ పర్వత ప్రాంతం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలోకి జారడం ఖాయం. ఎత్తైన హిమాలయాల్లో సైనికుల్ని మూడు నాలుగు నెలల కంటే ఎక్కువ ఉంచరు. అక్కడ ఉన్నన్ని రోజులు సైనికులకు స్నానం, దుస్తులు మార్చుకోవడం ఉండదు. మూడు నెలల తరువాత వారు సురక్షిత ప్రాంతాలకు వచ్చినప్పుడు చేసే మొదటి పని ఆ దుస్తులు విప్పి కాల్చేయడం! అక్కడి చలికి వేళ్ళు కొంకర్లు తిరుగుతాయి. ఫ్రాస్ట్ బైట్‌కు గురవుతారు. ఆ ఎత్తయిన ప్రాతంలో ఒకవేళ ఎవరైనా జబ్బుపడ్డా, గాయాల పాలైనా, మరణించినా, వాళ్ళను తరలించడానికి హెలికాప్టర్ ఒక్కటే మార్గం. ఆ వాతావరణంలో హెలికాప్టర్ వస్తుందో రాదో కూడా చెప్పలేం! ఇక ఈశాన్య ప్రాంతాల సరిహద్దు విషయానికి వస్తే ఆ ప్రాంతం పర్వత ప్రాంతం, పైగా దట్టమైన అడవులు. ఏ చెట్టు చాటు నుంచి ఎవరు చొరబడుతున్నారో, ఏ పొదల చాటు నుంచి ఎవరు కాల్పులు జరుపుతారో నిత్యం గమనిస్తూ కాపలా కాయాలి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సైనికులు దేశం లోపల ఉన్న మనల్ని శత్రువుల నుంచి, ఉగ్రవాదుల నుంచి భయం లేకుండా కాపాడుతుంటారు. అది నిరంతర ప్రక్రియ. ఏ మాత్రం అప్రమత్తత వీడకూడదు. అప్పుడే దేశం లోపల



మనమంతా నిశ్చింతగా, సక్రమంగా మన పనులు చేసుకోగలుగుతాం, చేసుకుంటున్నాం. దేశం ఇప్పటికి ఐదు యుద్ధాలు చేసింది 1947-48, 1965-66, 1971, 1999 సంవత్సరాల్లో నాలుగు సార్లు పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఓడించింది. 1963లో చైనాతో యుద్ధం చేసి వారిని చొరబడకుండా నిలువరించింది. ఈ ఐదు యుద్ధాల్లో మన జవాన్లు, అధికారులు ఎందరో హతమయ్యారు, మరెందరో క్షతగాత్రులయ్యారు. అయినా కొన్ని కుటుంబాలు, కొన్ని ఊళ్లకు ఊళ్లే తమ కుటుంబ సభ్యులను సైన్యంలోకి పంపడానికి ఉత్సాహం చూపుతాయి. బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ఊళ్లలో సైనికుడు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు.దేశ సేవకి తమ వంతు పాత్ర పోషిస్తున్నామనే సంతోషం వారిది. సైన్యంలో లేనివాళ్లు సహజంగా అనుకుంటుంటారు – 'వారికేం, ప్రభుత్వం వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది కదా' అని. కాని అది వారికీ, వాళ్ళు చేసిన చేసిన సేవకి ప్రభుత్వం, ప్రజలు తీర్చుకుంటున్న ఋణం మాత్రమే! ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే, దేశం లోపల ఉన్న మనలో కొందరు సైన్యాన్ని గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నాయకులు, అందునా రాజ్యాంగపరమైన పదవిలో ఉన్నవారు. మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్ కేబినెట్ మంత్రి విజయ్ షా "వాళ్ళ పహాల్గమ్ టెర్రరిస్టులు మతం అడిగి హిందువులను చంపారు కాబట్టి మోదీ వాళ్ళ సోదరినే వాళ్ళ పీచమణచడానికి పంపారు" అని వ్యాఖ్యానించాడు. కల్నల్ సోఫియా ఖురేషి ఒక ముస్లిం వనిత కాబట్టి అలా అన్నాడు. సైన్యం గురించి అతిగొప్పగా చెప్పే మోదీ గాని, బీజేపీ కానీ ఆయన మీద ఏ విధమైన చర్య తీసుకోలేదు. కారణం, మధ్యప్రదేశ్ మొత్తం జనాభాలో 23 శాతం ఆదివాసీలున్నారు. ఈ 23 శాతంలో 35 శాతం గోండులు. ఈ విజయ్ షా గోండు సముదాయానికి చెందినవాడు. అతని మీద చర్య తీసుకుంటే గోండుల ఓట్లుతో పాటు, ఆదివాసీల ఓట్లు పడవేమో అన్న భయం. విజయ్ షా వ్యాఖ్యానించిన రెండవ రోజు అదే మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, "దేశ సైన్యంతో పాటు దేశ జనాభా మొత్తం మోదీ ముందు మోకరిల్లుతుంది" అని వాఖ్యానించారు. ఏ దేశ సైన్యం పేరు చెప్పుకుని వీళ్ళు ఓట్లు తెచ్చుకుంటారో ఆ సైన్యాన్ని ఈ విధంగా అవమానించడం సహించరాని విషయం. దేశ రక్షణను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా బీజేపీ ఆ ఇద్దరు మంత్రులపై చర్య తీసుకోవాలని, సైనికుల మనోబలాన్ని దిగజార్చే వాఖ్యలు, చర్యలు ఇకముందు ఉండకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఓయూ లో హిందీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అత్యవసర డిపార్ట్మెంటల్ సమావేశం..



**తెలంగాణ వీణ/ఓయూ:**
ఉస్మానియ విశ్వవిద్యాలయంలో హింది డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అత్యవసర డిపార్ట్మెంటల్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ సయ్యద్ తలత్ సుల్తానా, విభాగ అధ్యక్షురాలు ప్రొఫెసర్ డబ్ల్యు మాయాదేవి, బోర్డ్ ఆఫ్ స్టడీ చైర్పర్సన్ ప్రొఫెసర్ కే సంగీత వ్యాస్ పాల్గొన్నారు, ఇటీవల తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధ్యక్షులు ఆన్లైన్లో నిర్వహించిన సమావేశంలో భాషా సాహిత్యాల అన్నింటికీ కేవలం రెండు సంవత్సరాల వ్యవదితో కూడుకున్న 12 క్రెడిట్ మాత్రమే కేటాయించడం జరిగింది. ప్రస్తుతం హిందీకి 20 క్రెడిట్ తో కూడుకున్న మూడు సంవత్సరాలతో కూడిన డిగ్రీ ఉంది ఈమార్పు ఏ విశ్వవిద్యాలయాలను సంప్రదించకుండా వారంతట వారు నిర్ణయం తీసుకున్నరని తెలిపారు, దీనిపై వెంటనే చర్చించి ప్రస్తుతం ఉన్న విదానాన్ని కొనసాగించాలని విశ్వవిద్యాలయాలకి ఉన్నత విద్యా మండలి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ చేయవలసిన అవసరం ఉందని వివిధ కళాశాలల నుంచి వచ్చినటువంటి ప్రొఫెసర్లు అధ్యాపకులు తమ అభిప్రాయాన్ని చెబుతూ ప్రస్తుతం ఉన్నటువంటి 20 క్రెడిట్ తో కూడుకున్న మూడు సంవత్సరాల అధ్యయనాన్ని కొనసాగించాలని ఈ మిటింగ్ లో ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విద్యాధర్ ప్రొఫెసర్ అప్సరునిసా బేగం ప్రొఫెసర్ సంగీత డాక్టర్ మధుకర్ డాక్టర్ సీతారాం రాథోడ్, డాక్టర్ రాజేంద్ర కుమార్ హర్ధ రాజేష్ డాక్టర్ లీలావతి, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ దత్తాత్రేయ డాక్టర్ సమర్ కుమార్ గోష్ తదితరులు పాల్గొన్నారు.


# భక్తి శ్రద్ధలతో ఇరుముడులు





**తెలంగాణ వీణ,మేడ్చల్ :**
రామ నామ స్మరణలతో అలియాబాద్ మారమోగింది. హనుమాన్ మాల ధారణ స్వాముల వీరమళ్ళ ఇరుముడుపూజ అలియాబాద్ గ్రామంలో గురువారం శోభాయమానంగా జరిగింది. శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలోని రామాలయం, నడిం గడ్డ ప్రసన్న ఆంజనేయ స్వామి సన్నిధిలో లక్ష్మణ్ గురుస్వామి, సతీష్ గురుస్వాముల ఆధ్వర్యంలో 50 మంది హనుమాన్ మాలధారణ స్వాములు మండల దీక్ష పూర్తి చేసుకుని వీరమళ్ళకు వెళ్లారు. గ్రామ ప్రాంగణం అంత జై శ్రీరామ్ అనే భక్తి నినాదాలతో మారు మ్రోగింది.

## హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల



**తెలంగాణ వీణ,ఉప్పల్....**
చిల్కానగర్ డివిజన్లోని ఎన్జీఆర్ఐ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ముఖ్యంగా వారి ఆశీస్సులు కెసిఆర్ పై, బండారి కుటుంబ సభ్యులపై ఉండాలని వేడుకున్నారు.కార్యక్రమంలో ఈవో కడలి వెంకన్న ,ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్ర శర్మ ,జూనియర్ అసిస్టెంట్ పెద్దిగారి శ్రీకాంత్ ,అర్చకులు సంతోష్ శర్మ ,శ్రీకాంత్ శర్మ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దిపేట్ ప్రశాంత్, ఏదుళ్ళ కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ఫోటో బాలు , ముద్దం శ్రీనివాస్ యాదవ్,శ్యామ్,బంటి గౌడ్ మొదలగువారు పాల్గొన్నారు.

# శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డీఈవో



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట మండలం, మండల స్థాయి ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమము ఈ రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట లో ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి డిఇఓ రాధా కిషన్ హాజరై శిక్షణను పర్యవేక్షించినారు. అలాగే వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ మే 20వ తేదీ నుండి 26 4వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించబడును. ఈ కార్యక్రమ నిర్వాహకులుగా మండల విద్యాధికారి నీరజ మరియు ఆర్పీలుగా కిషన్, మల్లికార్జున్, రాజశేఖర్, తిరుపతి, రంజిత్, రాజశేఖర్ తదితరులు వ్యవహారిస్తున్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న

**బిజెపి సీనియర్ నాయకులు బండ శివారెడ్డి ఆహ్వానం మేరకు బిజెపి సీనియర్ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి టిడిపి తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్**





**తెలంగాణ వీణ/తార్నాక:**
సింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ ,తార్నాక చౌరస్తాలో గణపతి దేవాలయం, హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొనడం జరిగింది.ఈ పూజలో జి ఎం.రమేష్, కిరణ్ గౌడ్,వరకుప్పల గణేష్, సతీష్ , యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# తాజా మాజీ సర్పంచిని పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**తెలంగాణ వీణ /చేగుంట..**
మెదక్ జిల్లా, చేగుంట మండలంలోని రుక్మ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి వాళ్ళ అమ్మ బసికె రత్నమ్మ మరణించిన విషయం తెలుసుకొని వెళ్లి వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులను పరమర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, రాజిరెడ్డి, బాణాపురం కృష్ణారెడ్డి, డిష్ రాజు, వివిధ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న డీసీఎం ను ఢీకొన్న బైక్ యువకుడు మృతి



**తెలంగాణ వీణ /చేగుంట...**
మెదక్ జిల్లా, చేగుంట మండల పరిధిలో ఎలాంటి సూచికలు లేకుండా రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుండి వస్తున్న బైక్ ఢీకొనగా యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడియారం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేష్ (21) మాసాయిపేట మండల కేంద్రంలో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు మరో స్నేహితుడు మధు తో కలిసి బైక్ పై వెళ్ళాడు. తిరిగి వస్తున్న క్రమంలో వడియారం గ్రామ శివారులో ఆగి ఉన్న డీసీఎం ను వేగంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన డీసీఎం డ్రైవర్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడు తల్లి పిట్ల కళమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# కుషాయిగూడ ఏసీపీగా వై. వెంకట్ రెడ్డి బాధ్యతలు



**తెలంగాణవీణ,కాప్రా...**
కుషాయిగూడ నూతన సహాయ పోలీస్ కమిషనర్ గా యాస వెంకట్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వివిధ హోదాల్లో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన వై. వెంకట్ రెడ్డి కుషాయిగూడ ఏసీపీగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల సహకారంతో నేరాలను అదుపు చేస్తామని తెలిపారు.

# ఎంపీ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ను అందించిన బీజేపీ నాయకులు



**తెలంగాణ వీణ /చేగుంట...**
మెదక్ జిల్లా, మాసాయిపేట మండల కేంద్రంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సహకారంతో మాసాయిపేట వాస్తవ్యులు వడ్ల శ్రీనివాస్ కు 45000/- రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొలుగు నాగేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు నవీన్ యాదవ్, రవి కిరణ్ గౌడ్, బూత్ అధ్యక్షులు రాములు, సాయి, సత్యనారాయణ, కుమార్ యాదవ్, ముక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు.

**మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోధ పాండురంగారెడ్డి.**



**తెలంగాణవీణ...**
రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయడం జరుగుతుందని మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోధ పాండురంగారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామంలోని మూడో వార్డులో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజను నిర్వహించి, లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలకు సొంతింటి కల నెరవేరుతుంటే సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అని చెప్పి పేదలకు అరచేతులో వైకుంఠాన్ని చూపించారని ఆయన ధ్వజమెత్తారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన వారికి మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందని ఆయన అన్నారు. పేదలు ఇందిరమ్మ ఇండ్లను సకాలంలో నిర్మించి సొంతింటి కల ను నెరవేర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునగని రాజు, కోటగల్ల రాజ్ కుమార్, కోట గల్ల రంజిత్ కుమార్, బాలరాజు, రామస్వామి, అర్జున్, స్వామి, మధుకర్ వార్డు ఆఫీసర్లు అశోక్, మల్లేష్, మనోహర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ కోసం అవగాహన సదస్సు







**తెలంగాణవీణ,హైదరాబాద్:**
జలమండలి సౌజన్యంతో వాటర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో కూకట్పల్లిలో నిర్వహించిన జల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవలంబించాల్సిన పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ డిడి జ్యోతి కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి భూగర్భ జల వనరుల నిపుణులు డాక్టర్ జాల సత్యనారాయణ వాటర్ ఎయిడ్ ఎస్పిడి ఆల్విన్ మనీష్ షా కూకట్పల్లి డివిజన్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ రావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమార్ మాట్లాడుతూ వాల్టా చట్టం చెట్టు నీరు సంరక్షణ కోసం సూచిస్తున్న నియమ నిబంధనల గురించి వివరించారు వాల్టా చట్టాన్ని సరైన విధంగా అమలుపరచినట్లయితే భూగర్భ జలాల సద్వినియోగం జరుగుతుందన్నారు. అదేవిధంగా భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణం వాటి నిర్వహణ పద్ధతుల గురించి భూగర్భ జల నిపుణులు ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ వివరించినారు. జల సంరక్షణ కోసం జలమండలి విషయపరిజ్ఞాన నిపుణుల సహకారంతో వాటర్ సంస్థ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను తెలియజేయడం జరిగింది. జనరల్ మేనేజర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకునేందుకు అనేక మార్గాలను సూచించారు వాహనాలను రోడ్డును పైపుతో ఎట్టి పరిస్థితుల్లో కడగకూడదు అన్నారు అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రతినిధులు, వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ప్రతినిధులు అదేవిధంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

# విత్తనాల కోసం ఎదురుచూపులు

**-రైతన్నకు జీలుగు, జనము,అందేనా...**
**-25 నుంచి రోహిణి కార్తీ ప్రారంభం..**
**-మండలంలో వరి సాగుకే రైతుల మొగ్గు..**



**తెలంగాణవీణ,పాపన్న పేట...**
వర్షాకాలం సాగు కోసం రైతన్నలు సన్నదమవుతున్నారు వ్యవసాయంలో భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.యాసంగి సాగు ముగియడంతో వర్షాకాలం సాగుపై రైతులు దృష్టి సారించారు. ఈనెల 25న ప్రారంభమయ్యే రోహిణి కార్తె నుంచి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని రైతుల నమ్మకం. ఇప్పటికే దుక్కులు దున్నుతున్నారు.గత ఏడాదితో పోల్చితే ఈసారి వానలు మే-నెలలోనే ప్రారంభమవ్వడంతో ముందస్తుగా సాగుకు సన్నద్ధమవుతున్నారు.కానీ ప్రభుత్వం అందించే సబ్సిడీ జీలుగు,జనుము విత్తనాలు రాకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పాపన్నపేట మండలంలో దాదాపు 28 వేల ఎకరాల సాగు భూమి ఉండగా మండల వ్యాప్తంగా వరి సాగు ఎక్కువగా చేస్తున్నారు ప్రస్తుతం వర్షాకాలంలో 26000 వేల పై చిలుకు ఎకరాలలో వరుసాగు, 2000 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కానీ ముందుగా భూసారాన్ని పెంచేం దుకు జీలుగ, జనుము ఎరువులను సాగు చేసి ఏపుగా పెరిగిన తర్వాత పొలంలోనే దున్ని మురుగబెడతారు. దీంతో భూసారం పెం పొందుతుందని రైతులు ఆశాభావం. ప్రభుత్వం సబ్సిడీపై అందించే జీలుగు, జనుము విత్తనాలు ఇంకా రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు త్వరతగతిన విత్తనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

**ప్రతిపాదనలు పంపించాం**
మండలంలో 150 క్వింటాళ్ల జీలుగతో పాటు 50 క్వింటాళ్ల జనుము విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వం అందించేందుకు మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని త్వరలోనే రైతులకు జీలుగు, జనుము, విత్తనాలు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు

# సైనిక్ ప్రవేశాలలో అర్హత సాధించిన చెవుల రఘునాథ్

**అభినందించిన గాయత్రి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గునుకుల ఈశ్వరరావు,**



**తెలంగాణవీణ,కల్లూరు:**
దేశవ్యాప్తంగా ఏప్రిల్ 5వ తారీఖున నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ నగర్ కి చెందిన చెవుల నరేష్, భూలక్ష్మి దంపతుల కుమారుడు చెవుల రఘునాథ్ కు ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్షలో 154 మార్కులు సాధించి విజయనగరం కోరుకొండ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ కు అర్హత పరీక్షకు ఎంపిక అయినందుకు గాయత్రి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గునుకుల ఈశ్వరరావు విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ కుమారుడు అర్హత సాధించడం పట్ల కోచింగ్ సెంటర్ నిర్వాహకులకు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు. సైనిక్ స్కూల్ ఫలితాల్లో అర్హత పరీక్షకి అర్హత సాధించడంతో మండల ప్రజలు, స్థానిక అంబేద్కర్ వాసులు అభినందనలు తెలిపారు.

# పాలమూరు విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగులకు ఈఎస్ఐ అమలు



**తెలంగాణవీణ,మహబూబ్నగర్...**
పాలమూరు విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బోధనేతర ఉద్యోగులఅందరికీ ఈఎస్ఐ అమలు చేస్తున్నట్లు ఆర్డర్ కాపీని అందజేసిన ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ సార్ కి మరియు రిజిస్ట్రార్ ఆచార్య రమేష్ బాబు సార్ కి పాలమూరు విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి బొకేతో సన్మానించి కృతజ్ఞతలు తెలపడం జరిగింది.ఎన్నో సంవత్సరాలుగా ఈఎస్ఐ కావాలని బోధనేతర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్నో వినతి పత్రాలు ఎన్నో ఉద్యమాలు చేసిన ఈరోజు పాలమూరు విశ్వవిద్యాలయానికి నూతనంగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ సార్ పెద్ద మనసుతో బోధనేతర ఉద్యోగులందరికీ ఈఎస్ఐ అమలు చేసినందుకు వారికి మా సంఘం తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో హెల్త్ కార్డు తీసుకోవాలన్న ఇన్సూరెన్స్ కంపెనీకి అయినా ప్రీమియం కట్టలేని పరిస్థితుల్లో మాకు అందరికీ ఈ హెల్త్ కార్డు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోని కార్పొరేట్ హాస్పిటల్ లో దాదాపు 17 హాస్పిటల్ లో కూడా ట్రీట్మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని బోధనేతర ఉద్యోగ సంఘం అధ్యక్షులు రామ్మోహన్ అన్నారు.
ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ సార్ గారికి మరియు రిజిస్టర్ సార్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలని, విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బోధనీతర ఉద్యోగులకు అందరికీ ఈపీఎఫ్ తో పాటు ఈఎస్ఐ అమలుపరిచినందుకు విశ్వవిద్యాలయం లోని ఉద్యోగాలు అందరు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నామని అన్నారు.వేతనాల పెంపు పై పెద్దలు గౌరవనీయులు ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ సార్ ని సంప్రదించగా త్వరలోనే మీకు శుభవార్త చెప్తానని చెప్పడం జరిగింది త్వరలోనే మీకు వేతనాలు పెంపుదల చేస్తానని చెప్పడం వలన మేము సార్ కి హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జీ ఎన్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ మీ అందరి శ్రేయస్సు కోరే మీకందరికీ ఈఎస్ఐ అమలు చేస్తున్నట్లు తెలుపడం జరిగింది.రిజిస్ట్రార్ రమేష్ బాబు గారు మాట్లాడుతూ మీ ఆరోగ్యమే మాకు చాలా ముఖ్యమని తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జే ఆర్ రామ్మోహన్ జి ఉపాధ్యక్షులు పర్వతాలు రాగిణి కోశాధికారి రాజేందర్ కార్యవర్గ సభ్యులు సురేష్ మాస్టర్ శ్రీనివాసులు వెంకటేష్ శ్రీనివాస్ రామకృష్ణ యూసుఫ్ సత్యం గౌడ్ రఘునందన్ రాము శృతి తారకేశ్వరి శంకర్ రవి కిరణ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం ఎస్ ఐ అనిల్ కు ఘన సన్మానం



**తెలంగాణవీణ,జగిత్యాల...**
రాష్ట్రంలోని పది ఉత్తమ పోలీస్ స్టేషన్లలో ఒకటిగా జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎంపిక కగా నిన్న హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదిగ ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కు ఎస్ హెచ్ ఓ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొడిమ్యాల దీపక్ రాజ్, మెట్‌పల్లి మాజీ పట్టణ అధ్యక్షులు కుతుబుద్దీన్ పాషా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లూరి సాగర్, ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి చీమల రాజు, మాజీ ఎంపీటీసీ తిమ్మని రాములు, కనుక దినేష్, హరిదాసు, కోరే రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 644 పాయింట్లు డౌన్..!



**తెలంగాణవీణ, బిజినెస్**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ప్రపంచ మార్కెట్‌లోని ప్రతికూల పవనాలు దేశీయ మార్కెట్లపై ఆ ప్రభావం పడింది. అమెరికా బాండ్ దిగుమతి పెరగడం, ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు పెరగడంతో పెట్టుబడిదారులను భయాందోళనకు గురి చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,323.05 స్వల్ప నష్టాల్లో మొదలైంది. రిలయన్స్, ఐటీసీ, ఇన్ఫోసిస్, ఎంఅండ్‌ఎంలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల వరకు పతనమైంది. ఇంట్రాడేలో 81,323.24 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 80,489.92 పాయింట్ల గరిష్టానికి పడిపోయింది. చివరకు 644.64 పాయింట్ల నష్టంతో 80,951.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 203.75 పాయింట్ల నష్టంతో 24,609.70 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,518 షేర్లు లాభపడగా.. 1,907 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హీరో మోటోకార్ప్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రికల్, జియో ఫైనాన్షియల్ లాభపడ్డాయి. ఓఎన్‌జీసీ, ఎంఅండ్ఎం, టెక్ మహీంద్రా, హిందాల్కో, విప్రో, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోల్ ఇండియా, ఐటీసీ, హెచ్‌యూఎల్, రిలయన్స్ ప్రధానంగా నష్టపోయాయి.

## భారీ షాక్ ఇచ్చిన బంగారం, వెండి ధరలు..

**తెలంగాణవీణ, బిజినెస్**

దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలోనే మే 22, 2025న ఉదయం నాటికి బంగారం, వెండి ధరలు భారీగా పెరిగి, బిగ్ షాక్ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం 22-5 2025) ఉదయం 6.30 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 1900 పుంజుకుని రూ. 97,430కి చేరింది. 22 క్యారెట్ పసిడి ధర 10 గ్రాములకు రూ. 1750 పెరిగి రూ. 89,310కి చేరుకుంది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ. 97,580కి చేరుకోగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 89,460కు చేరింది.

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

బంగారంతో పాటు, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. ఈ క్రమంలో ఢిల్లీలో వెండి ధర కిలోకు రూ. 2000 పెరిగి, రూ. 100100కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్, తిరుపతి, విజయవాడలో కిలో వెండి ధర రూ.2100 పెరిగి



రూ.111,100కు చేరుకుంది. ఈ నేపథ్యంలో చెన్నై, కేరళ ప్రాంతాల్లో కూడా వెండి ధరలు రూ.111,100గా ఉన్నాయి. మరోవైపు నోయిడా, నాసిక్, మైసూర్, సూరత్, నాగ్ పూర్, పాట్నా, జైపూర్, ముంబై ప్రాంతాల్లో వెండి రేట్లు రూ. 100100కు చేరాయి.

**ప్రధాన నగరాల్లో బంగారం ధరలు**

ఈ క్రమంలో చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 89,310 కాగా, 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ. 97,430గా ఉంది. ముంబైలో బంగారం ధరలు చెన్నైతో సమానంగా ఉన్నాయి. 22 క్యారెట్ బంగారం ధర ఒక గ్రాముకు రూ. 8930గా ఉండగా, 24 క్యారెట్ రూ. 9743గా కలదు. ఢిల్లీలో 22 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 8,9460 ఉండగా, 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 97,580కి చేరుకుంది. బెంగళూరు, హైదరాబాద్, కేరళ, పూణే, వడోదరలో 22 క్యారెట్ 24 క్యారెట్ బంగారం ధరలు వరుసగా 10 గ్రాములకు రూ. 89,310, రూ. 97,430 స్థాయిలో ఉన్నాయి.

**ఈ వారం బంగారం, వెండి ధరలు**

బంగారం, వెండి ధరలు ఈ వారం అస్థిరంగా ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే డాలర్ ఇండెక్స్‌లో హెచ్చుతగ్గులు, రష్యా-ఉక్రెయిన్ ఒప్పందం వంటి పలు కారణాలతో వీటిలో మార్పు రావచ్చని అంటున్నారు. ఈ క్రమంలో బంగారం ధరలు ఔన్స్‌కు $3,120 వద్ద సపోర్ట్ స్థాయిని కలిగి ఉండవచ్చని, వెండి ధరలు కూడా $31.40 స్థాయికి చేరుకోవచ్చని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

## సింగిల్ చార్జింగ్‌తో 449 కిలోమీటర్లు

### మార్కెట్లోకి ఎంజీ విండ్సోర్

**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిల్లీ,**

దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా సరికొత్త మాడల్‌ను తీసుకొచ్చింది. ఎంజీ విండ్సర్ ఎక్స్‌క్లూజివ్ ప్రో రకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కారు ధర రూ.17.24 లక్షలుగా నిర్ణయించింది.52.9 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 449 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కంపెనీకి ఉన్న డీలర్ల వద్ద రూ.11 వేలు ముందస్తుగా చెల్లించి ఈ వాహనాన్ని బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది.



## ఇంగ్లండ్ పర్యటనకు వైభవ్ సూర్యవంశీ..
## టీమిండియా కెప్టెన్‌గా ధోని నయా శిష్యుడు

**తెలంగాణవీణ, క్రీడలు :**

భారత జూనియర్ క్రికెట్ కమిటీ, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే భారత అండర్-19 జట్టును ప్రకటించింది. ఈ 16 మంది సభ్యుల జట్టుకు ముంబైకి చెందిన యువ ఓపెనర్ ఆయుష్ మాత్రే నాయకత్వం వహించనున్నాడు. ఇటీవలే ఐపీఎల్ 2025లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**జూన్ 24 నుంచి జులై 23 వరకు పర్యటన..**

భారత అండర్-19 జట్టు జూన్ 24న ఇంగ్లాండ్ చేరుకుని, జులై 23 వరకు అక్కడ పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ఒక 50 ఓవర్ల వార్మప్ మ్యాచ్, 5 యూత్ వన్డే మ్యాచ్‌లు, 2 (మల్టీ-డే) మ్యాచ్‌లలో ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో తలపడనుంది. వచ్చే ఏడాది జింబాబ్వే, నమీబియాలో జరగనున్న అండర్-19 ప్రపంచకప్‌నకు సన్నద్ధమయ్యేందుకు ఈ పర్యటన యువ ఆటగాళ్లకు మంచి అవకాశాన్ని కల్పించనుంది.

**ఐపీఎల్ స్టార్స్ కు చోటు..**

ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆయుష్ మాత్రే, రాజస్థాన్ రాయల్స్ తరపున వైభవ్



సూర్యవంశీ అద్భుతమైన ప్రదర్శనలు చేశారు. 17 ఏళ్ల ఆయుష్ మాత్రే సీఎస్‌కే తరపున 6 ఇన్నింగ్స్‌లలో 206 పరుగులు చేశాడు. ఇందులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 48 బంతుల్లో 94 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ కూడా ఉంది. ఇక 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విషయానికొస్తే, అతను రాజస్థాన్ రాయల్స్ తరపున ఏడు మ్యాచ్‌లలో 252 పరుగులు చేసి, 206.56 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌ను నమోదు చేశాడు. గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. అతని అరంగేట్ర మ్యాచ్‌లోనే తొలి బంతిని సిక్సర్‌గా మలచి తన సత్తా చాటాడు.

**జట్టు ఎలా ఉందంటే?**

అండర్ 19 భారత జట్టులో ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు అవకాశం లభించింది. వికెట్ కీపర్ కం బ్యాటర్ అభిజ్ఞాన్ కుండూను వైస్ కెప్టెన్‌గా నియమించారు. జట్టులో ఎవరెవరు ఉన్నారో ఓసారి చూద్దాం..

భారత అండర్-19 జట్టు (16 మంది సభ్యులు):

ఆయుష్ మాత్రే (కెప్టెన్)

వైభవ్ సూర్యవంశీ ,విహాన్ మల్హోత్రా ,మౌల్యాజ్‌సింహ్ చావ్డా

రాహుల్ కుమార్ ,అభిజ్ఞాన్ కుండూ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్)

హర్‌వంశ్ సింగ్ (వికెట్ కీపర్) ,ఆర్.ఎస్. అంబ్రీష్ ,కనిష్క్ చౌహాన్ ,ఖిలన్ పటేల్

హెనిల్ పటేల్ ,యుధాజిత్ గుహా ,ప్రణవ్ రాఘవేంద్ర

మొహమ్మద్ ఎనాన్ ,ఆదిత్య రానా ,అనమోల్జీత్ సింగ్

**స్టాండ్‌బై ఆటగాళ్లు:**

నమన్ పుష్పక్

డి. దీపేష్

వేదాంత్ త్రివేది


వికల్ప్ తివారి

అలంక్రిత్ రాపోలె (వికెట్ కీపర్

## ఆ 25 మంది అథ్లెట్లకు వీసా..
## కొరియా బయల్దేరిన భారత బృందం!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధమవుతున్న భారత అథ్లెట్లకు గుడ్ న్యూస్. మరో ఐదు రోజుల్లో టోర్నీ ఆరంభం కానుందనగా భారత బృందంలోని 25 మందికి ఎట్టకేలకు దక్షిణ కొరియా ప్రభుత్వం వీసా మంజూరు చేసింది. దాంతో, వాళ్లు కూడా స్క్వాడ్‌తో కలిసి పతకాల వేటలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.భారత క్రీడల మంత్రిత్వ శాఖ, కొరియాలోని భారత దౌత్యవేత్తల ప్రయత్నం ఫలించింది. స్క్వాడ్‌లో మిగిలిన 25 మందికి గురువారం సాయంత్రం వీసాలు మంజూరు



అయ్యాయి' అని ఏఎఫ్ఐ సెక్రటరీ జనరల్ సందీప్ మెహతా మీడియాకు వెల్లడించాడు. 'వీసా కష్టాలు తొలగడంతో బ్యాచ్‌ల వారీగా అథ్లెట్లు కొరియాలోని గుమి చేరుకుంటారు. ప్రస్తుతం తిరువనంతపురంలోని శిక్షణ కేంద్రంలో ఉన్న భారత అథ్లెట్లు కొరియాకు బయల్దేరనున్నారు. బెంగళూరు, ముంబై, పాటియాలా ట్రైనింగ్ సెంటర్లలో ఉన్నవాళ్లు ముంబై, ఢిల్లీ నుంచి కొరియా వెళ్లుతార'ని ఏఎఫ్ఐ తెలిపింది.


**నీరజ్ చోప్రా దూరం**

ఆసియాలోనే అతిపెద్ద క్రీడా సమరమైన ఈ ఛాంపియన్‌షిప్ కోసం భారత అథ్లెట్ల సమాఖ్య 59 మందిని ఎంపిక చేసింది. కొరొయాలోని గుమిలో మే 27 న ఈ టోర్నీ షురూ కానుంది. నాలుగు రోజుల పాటు అంటే.. 31 వరకూ జరుగనుంది. అయితే.. స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మాత్రం ఈ

# స్పోర్ట్స్

## లక్నో దే మ్యాచ్.. గుజరాత్‌పై గెలుపు

**తెలంగాణవీణ, క్రీడలు :**



అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. టేబుల్ టాప్ జట్టు అయిన గుజరాత్ టైటాన్స్‌పై సాధికారిక విజయాన్ని సాధించింది. 33 పరుగుల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (117) అద్భుత సెంచరీతో చెలరేగడంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ టీమ్ భారీ స్కోరు సాధించింది. అనంతరం మెరుగ్గా బౌలింగ్ చేసిన లఖ్‌నవూ.. గుజరాత్‌ను కట్టడి చేసింది. ఈ రోజు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్లు తలపడుతున్నాయి టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో లఖ్‌నవూ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై లఖ్‌నవూ ఓపెనర్లు చెలరేగారు. మార్‌క్రమ్ (36) తో కలిసి తొలి వికెట్‌కు మార్ష్ 91 పరుగులు జోడించాడు. భారీ సిక్స్‌లు, ఫోర్లతో హోరెత్తించాడు. 64 బంతుల్లో 8 సిక్స్‌లు, 10 ఫోర్లతో 117 పరుగులు చేశాడు. ఈ సీజన్‌తో తొలి సెంచరీ చేశాడు. మార్‌క్రమ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ మరో అర్ధశతకం సాధించాడు. 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. చివర్లో పంత్ (16) కీలక పరుగులు చేశాడు. దీంతో లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 235 పరుగులు చేసింది. 236 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ బ్యాటర్లు వేగంగా ఆడడంలో విఫలమయ్యారు. తాజా సీజన్‌లో వరుసగా రాణిస్తూ వచ్చిన టాపార్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. సాయి సుదర్శన్ (21), గిల్ (35), జాస్ బట్లర్ (33) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. మిడిలార్డర్ బ్యాటర్ షారూక్ ఖాన్ (57) హాఫ్ సెంచరీ చేశాడు. అయితే సాధించాల్సిన లక్ష్యం కొండంత ఉండడంతో గుజరాత్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేకపోయింది. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులు మాత్రమే చేయగలిగింది. 33 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. లఖ్‌నవూ బౌలర్లో రూర్కీ మూడు వికెట్లు తీశాడు. ఆవేశ్ ఖాన్, ఆయుష్ బదోనీ రెండేసి వికెట్లు తీశారు.

# నోరు విప్పిన అనన్య..

## పాపం బాగా హర్ట్ అయినట్లు ఉంది..



తెలంగాణవీణ, సినిమా :
తన కెరీర్ స్టార్టింగ్‌లో విన్న మాటలు ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయంటున్నారు అనన్య పాండే.. 'నీకూ.. స్మార్ట్ టీవీ స్క్రీన్‌కీ పెద్ద తేడా లేదు'. 'నీ కాళ్లేంటి? కోడి కాళ్లలాగా అంత సన్నగా ఉన్నాయి'.'అసలు నువ్వెంత బక్కగా ఉన్నావో చూసుకున్నావా?', ' మనిషన్నాక కాసింత కండ ఉండాలి... మరి నువ్వేంటి అగ్గిపుల్లలాగా ఉన్నావ్?' .. అంటూ తన గురించి అవతలివాళ్లు చేసిన కామెంట్లు వినీ వినీ విసుగొచ్చిందంటున్నారు అనన్య.గట్టిగా 18 ఏళ్లు నిండక ముందే ఇండస్ట్రీకి వచ్చానని అన్నారు లైగర్ బ్యూటీ. అప్పుడు తాను సన్నగానే ఉండేదానన్ని చెప్పారు. మహిళల ఫిజిక్ గురించి మాట్లాడినంతగా, ఈ సొసైటీ మగవారిని పట్టించుకోదని చెప్పారు. మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీలో ముందడుగు వేయడానికి ఎంతో సంయమనంతో వ్యవహరిస్తున్న సమయంలో, ఫిజిక్ పరంగా ఎదురయ్యే స్ట్రెస్‌ని తట్టుకోవడం అంత ఈజీ కాదంటున్నారు ఈ బ్యూటీ.రీసెంట్‌గా అనన్య జఘన సౌందర్యానికి శస్త్ర చికిత్స చేయించుకున్నారనే వార్తలు బాలీవుడ్‌లో వైరల్ అయ్యాయి. వీటి గురించి కూడా స్పందించారు అనన్య. నేను అలాంటివేమీ చేయించుకోలేదు.. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాస్త నిండుగా కనిపిస్తున్నాను. అంత మాత్రానికే నోటికి వచ్చినట్టు మాట్లాడేవారిని చూస్తుంటే ఏవగింపుగా ఉందన్నారు.రీసెంట్‌గా అనన్య జఘన సౌందర్యానికి శస్త్ర చికిత్స చేయించుకున్నారనే వార్తలు బాలీవుడ్‌లో వైరల్ అయ్యాయి. వీటి గురించి కూడా స్పందించారు అనన్య. నేను అలాంటివేమీ చేయించుకోలేదు.. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాస్త నిండుగా కనిపిస్తున్నాను. అంత మాత్రానికే నోటికి వచ్చినట్టు మాట్లాడేవారిని చూస్తుంటే ఏవగింపుగా ఉందన్నారు.



# జెట్ స్పీడ్‌లో 'పెద్ది' షూటింగ్..

## రామ్ చరణ్ ఫొటో పంచుకున్న టీమ్.!

తెలంగాణవీణ, సినిమా :
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో భారీ పోరాట సన్నివేశాలతో పాటు, చిత్రంలోని ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. తాజాగా హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. సెట్స్ నుంచి కొత్త ఫొటోను పంచుకుంది టీమ్. ఇందులో దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు రామ్ చరణ్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కలిసి ఉన్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది.బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్షన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు భట్టాచార్య వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# NC24లో నాగచైతన్యకు జోడీగా మీనాక్షి చౌదరి.!




తెలంగాణవీణ, సినిమా :
తండేల్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న టాలీవుడ్ నటుడు నాగచైతన్య ప్రస్తుతం విరుపాక్ష దర్శకుడితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం NC 24' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోంది. ఇటీవలే షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమా ఒక మైథలాజికల్ థ్రిల్లర్ లేదా ట్రెజర్ హంట్ థీమ్తో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నాగచైతన్య ట్రెజర్ హంటర్ (నిధి వేటగాడు) పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అయితే ఈ సినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఎంపికైనట్లు తెలుస్తుంది. మీనాక్షి చౌదరి ఇందులో ఆర్కియాలజిస్ట్ పాత్రలో నటించబోతుంది.ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో 5 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన ఒక గుహ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సెట్ నిర్మాణానికి 50 రోజులు పట్టిందని, కళా దర్శకుడు శ్రీనాగేంద్ర దీన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని చిత్ర బృందం తెలిపింది. ఈ గుహలో తీస్తున్న సన్నివేశాలు సినిమాలో 20 నిమిషాలకు పైగా ఉంటాయని దర్శకుడు కార్తీక్ వర్మ దండు వెల్లడించారు. 'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాగచైతన్య నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మిస్టిక్ థ్రిల్లర్ జానర్‌లో చైతన్యకు ఇది తొలి సినిమా కావడం, మీనాక్షి చౌదరితో ఆయన కాంబినేషన్ ఫ్రెష్‌గా ఉండటంతో ప్రేక్షకుల ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదే విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ కలిసి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.



# గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లొచ్చేవి!

తెలంగాణవీణ, సినిమా :
'మళ్లీరావా' 'దేవదాస్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులు దగ్గరైంది ఆకాంక్ష సింగ్. ఓవైపు వెబ్ సిరీస్‌లలో బిజీ ఆర్టిస్టుగా ఉంటూ సినిమాల్లో కూడా రాణిస్తున్నదీ భామ. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'షష్టిపూర్తి' ఈ నెల 30న విడుదలకానుంది. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి పవన్‌ప్రభ దర్శకుడు. రూపేష్ నిర్మాత. ఈ సందర్భంగా బుధవారం ఆకాంక్షసింగ్ విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. తల్లిదండ్రుల గొప్పతనాన్ని, వారి త్యాగాన్ని తెలియజెప్పే ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలని కోరిందితన పాత్ర గురించి చెబుతూ 'ఈ సినిమాలో నేను గ్రామీణ ప్రాంతానికి చెందిన అచ్చ తెలుగమ్మాయి జానకిగా కనిపిస్తా. లంగావోణితో తెరపై కనిపించడం గొప్ప అనుభూతినిచ్చింది. రాజమండ్రి గోదావరి పరిసర ప్రాంతాల్లో నెలరోజులు షూటింగ్ జరిగింది. గోదారి అందాలకు మైమరచిపోయా' అని చెప్పింది. రాజేంద్రప్రసాద్‌గారి దగ్గరి నుంచి ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నానని, తామిద్దరం గ్లిజరిన్ అవసరం లేకుండానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించామని, తెలియకుండానే కన్నీళ్లొచ్చేవని ఆకాంక్షసింగ్ పేర్కొంది.

# స్టైల్ మార్చిన ప్రభాస్.. కాన్సన్‌ట్రేషన్ కేవలం ఒక్కదానిపైనే



తెలంగాణవీణ, సినిమా :
పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ లైనప్‌లో ఎప్పుడూ ఐదారు సినిమాలు కనిపిస్తుంటాయి. కనీసం రెండు సినిమాలైనా సెట్స్ మీద ఉంటాయి.కానీ అప్ కమింగ్ మూవీ విషయంలో ఈ స్టైల్ పక్కన పెట్టేయాలని ఫిక్స్ అవుతున్నారు ప్రభాస్. పూర్తిగా ఒక్క సినిమా మీదే కాన్సన్‌ట్రేట్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు.ప్రజెంట్ ది రాజాసాబ్, ఫౌజీ సినిమాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు ప్రభాస్. సెప్టెంబర్ నుంచి స్పిరిట్‌ను పట్టాలెక్కించాల్సి ఉంది.కానీ డార్లింగ్ లేటెస్ట్ డెసిషన్‌తో స్పిరిట్ షూటింగ్ మరో నాలుగు నెలలు ఆలస్యం కానుందన్న టాక్ వినిపిస్తోంది.సెట్స్ మీద ఉన్న రెండు సినిమాలు పూర్తయిన తరువాతే స్పిరిట్‌ను పట్టాలెక్కించాలని ఫిక్స్ అయ్యారు ప్రభాస్.స్పిరిట్‌లో ప్రభాస్‌ను డిఫరెంట్ చూపించాలనుకుంటున్న సందీప్ బల్క్ డేట్స్ కావాలంటున్నారు. అందుకే ప్రియర్ కమిట్మెంట్స్ అన్నీ పూర్తి చేసుకొని ఫుల్ టైమ్ స్పిరిట్‌కే కేటాయించేలా ప్లాన్ చేస్తున్నారు డార్లింగ్. మరి ఈ ప్లానింగ్ ఎంత వరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.


Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written